క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 60మందికి జరిమానా

- సామాజిక సేవకు ఆదేశాలు



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న మందుబాబులు

భీమునిపట్నం: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి మంగళవారం ఇక్కడి ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు శిక్ష విధించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 60 మందిని ట్రాఫిక్ ఎస్‌ఐ సీహెచ్.చిరంజీవిరావు కోర్టులో హాజరుపరిచారు. వీరికి జడ్జి జి.విజయలక్ష్మి రూ. వెయ్యి రూపాయల చొప్పున రూ.60వేలు జరిమానా విధించారు. దీంతో పాటు సామాజిక సేవ కింద స్థానిక డైట్ కళాశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. ఆ మేరకు వీరందరూ ఇక్కడ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు.

పీఎం పాలెం స్టేషన్ పరిధిలో..

పీఎం పాలెం: పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 21 మంది మందుబాబులకు 51 వేల రూపాయలు జరిమానా న్యాయస్థానం విధించిందని స్థానిక ట్రాఫిక్ ఎస్‌ఐ మురళీకృష్ణ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 21మందిని ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ ఫర్ ఎక్సైజ్ కోర్టు ముందు హాజరు పరచగా ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయల నుంచి 5 వేల రూపాయల వరకు జరిమానా విధించినట్లు వివరించారు.

అనాథ వృద్ధులకు తోబుట్టువులుగా..



రామయోగి అగ్రహారం శ్రీసద్గురు సేవాశ్రమంలో వృద్ధులకు రాఖీలు కడుతున్న దాతలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు రామయోగి అగ్రహారంలోని శ్రీ సద్గురు సేవాశ్రమంలో 60 మంది వరకు వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. కోన అప్పలరాజు అలియాస్ యోగారాజు వీరికి నిత్యం ఆహారం, వసతి, వస్త్రాలు, వైద్యం తదితర బాగోగులు చూస్తుంటారు. మిగిలిన రోజుల్లో ఎవరైనా తమ ఇళ్లల్లో జరిగే పుట్టినరోజు, పెళ్లిరోజు వేడుకలలో భాగంగా ఈ ఆశ్రమంలో వృద్ధులకు భోజనం సమకూరుస్తారు. ఇందులో భాగంగా రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం వృద్ధులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు తినిపించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దీంతో వారి కళ్లల్లో ఆనందం విరిసింది.

చంద్రంపాలెం హైస్కూల్ పీడీ రాముకు పురస్కారం



అతిథుల నుంచి చెక్కు, సర్టిఫికెట్ అందుకుంటున్న రాము

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పెంటకోట రాము ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసన్నకుమార్, ఎస్. కోదండరామయ్య కుమారుడు శ్రీధర్ తదితరులు ఈ అవార్డుతో పాటు గోల్డ్ మెడల్, రూ.10వేలు నగదు పోత్సాహకం, ధ్రువపత్రం అందించారు. రామును ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందించారు.

మధురమైనది తెలుగు భాష

- కొనియాడిన వక్తలు
- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



తెలుగు పండితుడు గౌరీశంకరశాస్త్రిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



చంద్రంపాలెం హైస్కూల్లో ఏర్పాటు చేసిన తెలుగు ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తున్న విద్యార్థినులు



తెలుగు కవుల చిత్ర పటాలు, గ్రంథాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

మధురవాడ: తెలుగు భాష మధురమైనదని వక్తలన్నారు. అన్ని భాషల్లోకి ప్రత్యేకమైనదని కొనియాడారు. గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని నియోజకవర్గంలోని పాఠశాలలు, కార్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు.

ఆకట్టుకున్న తెలుగు ఎగ్జిబిషన్

చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు విభాగాధిపతి జి.సూర్యకుమారి, సీనియర్ ఉపాధ్యాయిని పీఎస్ఎస్ లక్ష్మి ఇతర తెలుగు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు 111మంది కవుల చిత్రపటాలు, వారి జీవిత చరిత్ర, వారు రాసిన పుస్తకాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. దీనిని ప్రధానోపాధ్యాయుడు రాజబాబు తదితరులు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంస్కృతాంధ్ర భాషా పండితుడు, బ్రహ్మశ్రీ సర్వాజోస్యుల గౌరీ శంకరశాస్త్రిని ఘనంగా సత్కరించారు. ఇక్కడ విద్యార్థులు, కవి మేళా నిర్వహించారు. తెలుగుదనం ఉట్టిపడేలా వస్త్రధారణ చేసి, వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీడీ రాము, ఇతర వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- బక్కన్నపాలెం రోడ్డులోని మధురవాడ శ్రీచైతన్య స్కూల్లో ప్రిన్సిపాల్ సందీప్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత

ఆనందపురం : ఎంతో ప్రాచీనమైన, పలు భాషలకు మూలమైన తెలుగు భాషను పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఏయూ విశ్రాంత తెలుగు ప్రొఫెసర్ అవధాని అన్నారు. మండలంలోని గుడిలోవ విజ్ఞాన్ విహార్ విద్యాలయంలో తెలుగు భాషా వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రాచీన కవుల నుంచి ఆధునిక కవుల వరకు గల వారి చిత్రపటాలను, వారు వెలువరించిన గ్రంథాలను ప్రదర్శనలో ఉంచారు. అందులో కవులు రచనలు, బిరుదులు, సాహిత్య సేవలను పొందుపరిచారు. సుమారు 800 మంది విద్యార్థులు ప్రదర్శనను తిలకించారు. వారికి పద్య, పఠన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, భాషా పండితులు పాల్గొన్నారు.

భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని సీహెచ్ రోజామణి మాట్లాడుతూ తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చి నిత్య వ్యవహారంలో భాషలో అందాన్ని, వీలును తెలియజేసిన మహనీయుడని కొనియాడారు. భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ పుట్టినరోజును పురస్కరించుకుని ఇదే రోజును జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకొంటారని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు ఎస్.సావిత్రి, పీవీ లక్ష్మి, విజయరాజి, భాగ్యవతి, ఉదయకుమార్, భీమాబాయి పాల్గొన్నారు

- భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చేపూరు సూర్యప్రసాద్, ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు పి.దుర్గాప్రసాదరావు, బి.మాధవరావు, సూరిబాబు, రామునాయుడు, జీవీ రమణి, కె.సాయిబాబు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేష్, నాగమణి, మల్లిక పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, నాటిక, పద్య పఠనం, ఏకపాత్రాభినయం వంటి పోటీలు నిర్వహించారు. అనంతరం ధ్యాన్‌చంద్, గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటాలకు హెచ్ఎం శాంతి ప్రసూన పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు జి.ఎర్రయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జి.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్పదనం తెలుసుకోవాలి

భీమునిపట్నం: మన మాతృభాష తెలుగు గొప్పదనాన్ని ప్రతీ విద్యార్థి తెలుసుకోవాలని పండిట్ నెహ్రూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని తిరుమల శ్రీదేవి అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో తాళ పత్రాల గ్రంథాలపై ముద్రించిన రామాయణం సుందరకాండను ప్రదర్శించారు. విద్యార్థులకు తాళపత్ర గ్రంథాల గురించి, వాటిపై ఉన్న లిపి గురించి తెలియపరచి వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. సమీపంలోని సెడార్ పాఠశాలలో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినుల నృత్యాలు అలరించాయి.



భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు వెంకట రామమూర్తికి అధ్యాపకుల నివాళి



చిట్టివలస బాలికల హైస్కూల్‌లో ..



ధ్యాన్‌చంద్, గిడుగు చిత్ర పటాలకు నివాళులు అర్పిస్తున్న మద్ది జెడ్పీ హైస్కూల్ సిబ్బంది



తాళపత్ర గ్రంథాలతో సంప్రదాయ వస్త్రధారణలో నెహ్రూ ఉన్నత పాఠశాల విద్యార్థులు

నేటి నుంచి బంగారమ్మతల్లి ఉత్సవాలు

తగరపువలస: భీమిలి మండలం మజ్జిపేట గ్రామ దేవత బంగారమ్మ ఉత్సవాలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. బుధవారం తొలేళ్లు, గురువారం అమ్మవారి ఊరేగింపు, శుక్రవారం కనుమ పండగ నిర్వహించనున్నారు. పెద్ద ఎత్తున అనుపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

1న ఉచిత నేత్ర వైద్య శిబిరం

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సుత్తమ్మతల్లి ఆలయం వద్ద వచ్చేనెల ఒకటో తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం జరగనుంది. దివీస్ లేబొరేటరీ సామాజిక బాధ్యత విభాగం ఆధ్వర్యంలో నగరానికి చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేయనున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయనున్నారు. పరీక్షలకు వచ్చేవారు ఆధార్ కార్డులతో ఉదయం 9 గంటల నుంచి హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు.

కృష్ణాపురం సాగు నీటి కాలువలోకి నీరు విడుదల



గేటు ఎత్తి నీరు విడుదల చేస్తున్న అప్పలనాయుడు

పద్మనాభం: మండలంలోని పొట్నూరు సమీపాన గోస్తని నది వద్ద ఉన్న ఆనకట్టు గేటును వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు, రైతులు మంగళవారం ఎత్తి కృష్ణాపురం సాగు నీటి కాలువలోకి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ తన సొంత నిధులు రూ.2లక్షలతో పొట్నూరు నుంచి కృష్ణాపురం ఎర్ర చెరువు వరకు ఎనిమిది కిలో మీటర్ల నిడివిలో పూడిక తీయించిట్టు తెలిపారు. ఈ పూడిక తీయడం వల్ల కాలువ ద్వారా నీరు రావడంతో కృష్ణాపురంతో పాటు, పొట్నూరు, అర్చకునిపాలెం, ఇసకలపాలెం, పద్మనాభం గ్రామాలకు చెందిన 16 వందల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, బేపల గురునాయుడు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఇక్కడి క్యాంపు కార్యాలయంలో ముత్తంశెట్టి సమక్షంలో రెండో వార్డుకు చెందిన పలువురు మహిళలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు, దూషణలు చేస్తున్నా వాటిని ప్రజలు ఏమాత్రం నమ్మే స్థితిలో లేరన్నారు. పార్టీ రెండో వార్డు ఇన్‌చార్జి ఎస్.కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో చిల్ల కృష్ణవేణి, చిల్ల నీలవేణి, బి.ఆదిలక్ష్మి, ఐ.వరలక్ష్మి, బి.సునీత, బి.లీల, ఎస్.అప్పయ్యమ్మ, కె.వెంకటలక్ష్మి తదితరులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అక్కరమాని మంగరాజు, ఎస్.సరళారాణి, కొప్పల రమేష్, చిల్ల భాస్కరరెడ్డి, శిల్ల వంశీరెడ్డి, చిల్ల ప్రమీల, దువ్వి రామయ్యమ్మ పాల్గొన్నారు.

ఎండాడలో నేత్రదాన వారోత్సవాలు

కొమ్మాది: గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆస్పత్రి, వైద్య కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ నేత్రదాన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎండాడ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రో. వైస్ చాన్సలర్ బి.గీతాంజలి మాట్లాడుతూ దేశంలో ఏటా లక్ష మందికి కార్నియా మార్పిడి ద్వారా చూపు ప్రసాదించాల్సి ఉండగా.. 25 వేల మందికి మాత్రమే సాధ్యపడుతుందన్నారు. ప్రజల్లో నేత్రదానంపై అవగాహన పెంచడం ద్వారా మాత్రమే ఈ కొరతను నివారించగలమన్నారు.

గీతంలో నార్త్ కరోలీనా వర్సిటీ బృందం

కొమ్మాది: అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటైన నార్త్ కరోలీనా విల్‌మింగ్‌టన్ విశ్వవిద్యాలయ నిపుణుల బృందం మంగళవారం గీతం వర్సిటీని సందర్శించింది. ఇక్కడి కెరీర్ గైడెన్స్ సెంటర్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో నార్త్ కరోలీనా అంతర్జాతీయ సంబంధాల విభాగం ప్రతినిధి డాక్టర్ మైకేల్ విలిహన్, అసోసియేట్ డీన్ డాక్టర్ నివిన్ లిచి పాల్గొని ప్రసంగించారు. తమ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ కోర్సులు, బోధన, పరిశోధన విధానాలు వారు వివరించారు.

ప్రణాళికతో కృషి చేస్తే విజయం తథ్యం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

కొమ్మాది: మనలోని బలం, బలహీనతలను తెలుసుకుని ఒక ప్రణాళిక ప్రకారం కృషి చేస్తేనే విజయం సాధ్యమవుతుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం విద్యాలయ నిర్వాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను వినియోగించుకుంటేనే విద్యార్థులు ఉన్నత స్థానాలు చేరుకోగలరన్నారు. విద్యాలయానికి రెండు బోరు బావులు, 4 తరగతి గదులు, పది కంప్యూటర్లు, పార్ట్‌టైమ్ డాక్టర్ సదుపాయం కల్పించడంతో పాటు స్టాఫ్ క్వార్టర్స్, రోడ్ల మరమత్తులు చేయడానికి వీలుగా సీపీడబ్ల్యూడీకి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. తాను కడప జిల్లాలో నవోదయ విద్యాలయంలో చదువుకున్నానని, వైద్య వృత్తి అనంతరం సివిల్స్‌కు ఎంపికైనట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపాల్ కె.సంజయ్, విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

వీనులవిందుగా సంగీత పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆనందపురం : హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠ మందిరం నిర్మాణం ప్రదేశంలో సాంస్కృతిక కార్నివాల్‌లో భాగంగా మంగళవారం నిర్వహించిన స్వర, గాత్ర సంగీత పోటీలు వీనులవిందుగా సాగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ 5 నుంచి 8 తరగతి విద్యార్థులకు నిర్వహించిన స్వర సంగీత పోటీల్లో 13 పాఠశాలల నుంచి 76 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీలో భాగంగా విద్యార్థులు అన్నమయ్య, త్యాగరాజు కీర్తనలు ఆలపించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు 8 నుంచి 10 తరగతులకు నిర్వహించిన గాత్ర సంగీత పోటీలో 9 పాఠశాలల నుంచి 63 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి గీత వ్యాఖ్యాతగా, నిఖిత శ్రీవల్లి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. హరేకృష్ణ మూమెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్‌లో మధురవాడ క్రీడాకారుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న అతిథులు

మధురవాడ: జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో మధురవాడకు చెందిన రెండు జట్లు ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నాయి. మైఖేల్ బాస్కెట్ బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన టోర్నమెంట్‌లో మధురవాడకు చెందిన ట్రూ బాలర్స్ క్లబ్‌కు చెందిన బాలురు, బాలికల జట్లు విశేష ప్రతిభ కనబరిచాయి. విజేతలకు పలువురు అభినందనలు తెలియజేశారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఎస్‌ఐ భరత్‌కుమార్‌రాజు

భీమునిపట్నం: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు, ఎస్‌ఐ ఎం.భరత్‌కుమార్‌రాజు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హాకి దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ తనకు స్ఫూర్తి అని, అలా హాకీ క్రీడాకారుడుగా రాణించానన్నారు. ఆ కృషి వల్లే తాను ఎస్‌ఐగా ఎంపికయ్యానని తెలిపారు. విద్యార్థులు కూడా తమకు ఇష్టమైన క్రీడలో బాగా శిక్షణ తీసుకుని కృషి చేస్తే లక్ష్యాన్ని సాధించవచ్చునన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, అధ్యాపకులు డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి, డాక్టర్ బి.సహదేముడు, రమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- నెహ్రూ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తిరుమల శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సెడార్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి తోషాలి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ఆనందపురం : విద్యతో పాటు క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మురుగదాస్ చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మురుగదాస్ మాట్లాడారు. భారతీయ క్రీడాకారులు అంతర్జాతీయంగా రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేతలకు ట్రోఫీలు, మొమెంటోలను బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ప్రసాదరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు దిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రమేష్

పీఎం పాలెం: బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి సిబ్బంది పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజులు, ఫిజికల్ డైరెక్టర్ ప్రసన్నకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

తగరపువలస: స్థానిక శ్రీబాసర జూనియర్, డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న క్రీడోత్సవాలు మంగళవారం ముగిశాయి. ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా బాల, బాలలకు కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్ బహుమతులు అందించారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని ఓటర్ల జాబితా పక్కాగా రూపొందిస్తున్నామని ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21వ వరకు బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాల పరిశీలన చేశారన్నారు. దీనిపై పలు రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ చాలా వరకు పరిశీలనలు పూర్తి కాలేదన్నారు. ఆర్‌డీవో స్పందిస్తూ మొత్తం వివరాలతో కూడిన జాబితాలను అక్టోబర్‌లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. అందులో పూర్తి వివరాలు లేకపోతే సరిచేస్తామన్నారు. ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలో 335 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో 1500 ఓటర్లు దాటిన కేంద్రాల వద్ద అదనపు కేంద్రాన్ని ఏరాటు చేస్తామని చెప్పారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు చేయవచ్చని, తప్పుడు ఫిర్యాదులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ జె.భాస్కరరావు, తహసీల్దారు కె.వేణుగోపాల్, వివిధ పార్టీల నాయకులు గాడు శ్రీను, డి.ఎ.ఎస్.రాజు, గంటా నూకరాజు, చందరరావు, కంటుభుక్త రామానాయుడు పాల్గొన్నారు.

289 మందికి నేత్ర వైద్య పరీక్షలు

పద్మనాభం: మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మోషన్ స్కూల్ హెల్త్ కేర్ ప్రాజెక్టు, పెదవాల్తేర్ విశాఖ ఐ ఆస్పత్రి ట్రస్ట్, సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 289 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ముగ్గురికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.వి.కృష్ణకుమార్, సత్య సాయి సేవా సంస్థల విశాఖ జిల్లా జోనల్ కో-ఆర్డినేటర్ వి.సత్యసాయికుమార్, గొల్లలపాలెం సత్యసాయి భజన మండలి కన్వీనర్ డి.అప్పలరాజు, విశాఖ ఐ ఆస్పత్రి క్యాంపు కో-ఆర్డినేటర్ సాయికృష్ణకుమార్ పాల్గొన్నారు.

కృష్ణాకాలనీలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..



కృష్ణాకాలనీలో జేసీబీతో తవ్వి నిలిచిన డ్రైనేజీ నీటిని మళ్లించిన దృశ్యం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ మూడో వార్డు కృష్ణాకాలనీలో నెలరోజులుగా అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యకు ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం పరిష్కారం చూపించారు. 'ఇళ్ల ముంగిట మురుగు' శీర్షికతో ఈ నెల 28న సాక్షిలో ప్రచురించిన వార్తకు స్పందించారు. ఇళ్ల ముందు నిలిచిన మురుగుతో దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో పాటు పలువురు వ్యాధుల బారిన పడ్డారు. వర్షాలకు గొల్లలపాలెం కొండపై నుంచి వచ్చే మురుగునీరు ఇళ్లలో ప్రవేశించేది. దీంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో ప్రచురించిన వార్తకు ఇంజినీరింగ్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు సాక్షికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.